నిర్వహణ లోపం.. పార్కుకు శాపం

- కళావిహీనంగా హెచ్‌బీ కాలనీ జీవీఎంసీ పార్కు
- ఆకతాయిలకు అడ్డాగా మారడంతో స్థానికుల్లో ఆందోళన
- ఇబ్బంది పడుతున్న వాకర్స్, సందర్శకులు
- అధికారులు దృష్టి సారించాలని విజ్ఞప్తి



నిర్వహణ లోపంతో కళతప్పిన పార్కు

మద్దిలపాలెం: ప్రజలకు ఆహ్లాదాన్ని పంచాల్సిన ఆ పార్కు నిర్వహణ లోపంతో కళావిహీనంగా తయారైంది. చీకటి పడితే చాలు ఆకతాయిల అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోంది. పార్కు చుట్టూ మద్యం, బీరు సీసాలు, తాగిపడేసిన గ్లాసులు, తిని విసిరేసిన ఆహార వ్యర్థాలు రోత పుట్టిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజూ ఉదయం, సాయంత్రం పార్కుకు వచ్చే వాకర్స్, సందర్శకులు ఇబ్బందులకు గురవుతున్నారు. 15వ వార్డు హెచ్‌బీ కాలనీలోని జీవీఎంసీ పార్కు దుస్థితి ఇది. అధికారుల పర్యవేక్షణ, నిర్వహణ లోపం.. ఈ పార్కుకు శాపంగా మారింది. దీని చుట్టుపక్కలంతా ఎక్కడ చూసినా చెత్తాచెదారం పేరుకుపోయి అధ్వానంగా తయారైంది.

నాడు కళకళ.. నేడు వెలవెల

15వ వార్డులో జీవీఎంసీ ఏర్పాటు చేసిన ఈ పార్కుకు ఉదయం, సాయంత్రం వేళల్లో వాకర్స్ అధిక సంఖ్యలో వస్తుంటారు. ఇక్కడ వాకర్స్ క్లబ్ ఉంది. పార్కు నిర్వహణ బాధ్యతలు జీవీఎంసీనే చూసుకుంటుంది. సరైన పర్యవేక్షణ, నిఘా లేక నిర్వహణ లోపంతో పార్కు అస్తవ్యస్తంగా మారింది. మొక్కలు నాటి, కూర్చోడానికి బెంచీలు, పిల్లల ఆటపరికరాలు అమర్చారు. మొక్కలకు నీటి సౌకర్యం, లైటింగ్, చుట్టూ ప్రహరీ కల్పించడంతో సందర్శకులతో కళకళలాడేది. అవి మూణ్ణాళ్ల ముచ్చటగానే మిగిలిపోవడంతో పార్కు వెలవెలబోతోంది.



15వ వార్డు హెచ్‌బీ కాలనీలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన జీవీఎంసీ పార్కు



పార్కులో వ్యాయామ పరికరాలు

రాత్రి వేళల్లో ఆకతాయిల ఆగడాలు

కాలనీకి కాస్త దూరంగా పార్కు ఉండటం, పర్యవేక్షణ లేకపోవడంతో ఆకతాయిలకు నిలయంగా మారింది. రాత్రయితే చాలు గుంపులుగా ఇక్కడ చేరి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. పార్కులో చుట్టుపక్కల ఎక్కడ చూసినా తాగిపాడేసిన మద్యం సీసాలే దర్శనమిస్తాయి. ఎక్కడ పడితే అక్కడ చెత్తాచెదారం, గ్లాసులు, చిప్స్ ప్యాకెట్ కవర్లతో పరిసరాలు అధ్వానంగా ఉన్నాయి. దీంతో చాలా వరకూ పార్కుకు జనం రావడం మానేశారు. ఇదే అదనుగా ఆకతాయిలు చీకటి పడితే చాలు చెలరేగిపోతున్నారు. గొడవలు పడుతూ చుట్టుపక్కల వారిని భయాందోళనలకు గురిచేస్తున్నారు.



పార్కు గేటు పక్కనే కుప్పలుగా మద్యం సీసాలు, చెత్తాచెదారం

కొరవడిన పోలీసు గస్తీ

హెచ్‌బీ కాలనీకి కాస్త దూరంగా ఉన్న ఈ పార్కు ప్రాంతంలో పోలీసుల రాత్రి గస్తీ కొరవడింది. ఎవరూ ఇక్కడికి రారు అనే ధీమాతో ఆకతాయిల ఆగడాలకు అదుపు లేకుండా పోయింది. అప్పుడప్పుడు పోలీసులు వచ్చి హడావిడి చేసి వెళ్లిపోతున్నారే తప్ప సమస్య పరిష్కరించడం లేదని స్థానికులు చెబుతున్నారు. అధికారులు దృష్టి సారించి ఆకతాయిలకు అడ్డుకట్ట వేయాలని, పార్కును సక్రమంగా నిర్వహించాలని కోరుతున్నారు.

పార్కుకు వెళ్లాలంటే భయమేస్తోంది

మా ప్రాంతంలోని పార్కు వల్ల చుట్టుపక్కల చాలా ఇబ్బందిగా ఉంది. చీకటి పడితే పార్కులో కొందరు చేరి మందు తాగి అల్లరి, గొడవ చేస్తున్నారు. పిల్లలను పార్కుకు పంపాలన్నా, మహిళలు వెళ్లాలన్నా భయమేస్తోంది. ఈ పార్కు దుస్థితిని అధికారులు పట్టించుకుని ప్రత్యేక నిఘా పెట్టాలి.

– అనిత, హెచ్‌బీ కాలనీ

ఏయూ సీడీసీ డీన్ వెంకటకృష్ణకు అభినందన



డీన్ ఆచార్య వెంకటకృష్ణను అభినందిస్తున్న ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు నాగరాజు

మహారాణిపేట: ఆంధ్ర విశ్వవిద్యాలయం సీడీసీ డీన్‌గా నియమితులైన ప్రొఫెసర్ టి.వెంకటకృష్ణను బుధవారం ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మున్నంగి నాగరాజు మాదిగ మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఆచార్య కృష్ణకు సీడీసీ డీన్‌గా అవకాశం కల్పించడంపై ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావుకు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో ఆచార్య వెంకటకృష్ణ నిర్వహించిన ప్రతి పదవికి వన్నె తెచ్చారని నాగరాజు కొనియాడారు. ఏపీ ఎడ్‌సెట్ కన్వీనర్ గాను, ఏయూ ఎంఎంటీఎస్ డైరెక్టర్ గాను ఆయన ఎంతో విజయవంతంగా తన బాధ్యతలను కొనసాగిస్తున్నారన్నారు. గతంలో సెక్యూరిటీ డీన్‌గా, ప్రెస్ అండ్ పబ్లికేషన్ డీన్‌గా, సైన్స్ కళాశాల చీఫ్ వార్డెన్‌గా, వైస్ ప్రిన్సిపాల్ గాను ఎంతో సమర్థవంతంగా తన బాధ్యతను నిర్వర్తించారని పేర్కొన్నారు. అందుకు గుర్తింపుగా ఈ పదవిని ఇవ్వడంపై ఎమ్మార్పీఎస్ జాతీయ, రాష్ట్ర, జిల్లా కమిటీల తరఫున ఏయూ వీసీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఇంజినీరింగ్ ఫిజిక్స్ ఫ్యాకల్టీ నందిగామ మురళి మాదిగ, విశాఖ అగ్రిఫామ్ డైరెక్టర్ సంకిలి అశోక్ మాదిగ, జాగ్రఫీ విభాగం రీసెర్చ్ స్కాలర్ ఎ.రాజు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్, అధికారులు, సిబ్బంది

విశాఖ సిటీ: వీఎంఆర్‌డీఏ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం బాలల ప్రాంగణంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమాన్ని మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ ప్రారంభించారు. అనంతరం ఆయన రక్తదానం చేసి దాని ఆవశ్యకతను వివరించారు. ఒకరు రక్తదానం చేయడం వల్ల ముగ్గురు ప్రాణాలను కాపాడిన వారవుతారని తెలిపారు. రక్తదాత ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందన్నారు. కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ కార్యదర్శి దాట్ల కీర్తి, ఎస్టేట్ అధికారి లక్ష్మారెడ్డి, ముఖ్య గణాంకాధికారి హరిప్రసాద్, ఎస్ఈ బలరామరాజు, కార్యనిర్వాహక ఇంజినీర్ రామరాజు, రేంజ్ ఆఫీసర్లు శ్యామల, శివానీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన బొచ్చ సురేష్



బొచ్చ సురేష్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న పురందేశ్వరి

ఎంవీపీకాలనీ: రియల్ ఎస్టేట్ వ్యాపారి, హేమ ఎబోడ్స్ అధినేత బొచ్చ సురేష్ బీజేపీలో చేరారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. లాసన్స్ బే కాలనీలోని పార్టీ కార్యాలయ ఆవరణలో బుధవారం ఈ కార్యక్రమం జరిగింది. కొన్నాళ్లుగా వివిధ కార్యక్రమాల ద్వారా ప్రజా సేవ చేస్తున్న బొచ్చ సురేష్ పార్టీలో చేరడంపై బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సురేష్ మీడియాతో మాట్లాడుతూ ఇప్పటి వరకు వ్యాపార రంగంలో రాణించిన తాను ప్రజా సేవ చేయాలనే ఆకాంక్షతో బీజేపీలో చేరినట్లు తెలిపారు. పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. మాజీ ఎంపీ జీవీఎల్, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విమ్స్‌లో మరింత భద్రతకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లో మరింత పటిష్టమైన భద్రతకు చర్యలు చేపట్టనున్నారు. దీని కోసం నగర పోలీస్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు. విమ్స్‌కు జాతీయ రహదారి వైపు ఒక ప్రధాన ద్వారం, బీఆర్‌టీఎస్ వైపు మరో ప్రధాన ద్వారం ఉన్నాయి. ఈ రెండు ద్వారాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయలేదు. దీనిపై ఈ నెల 2న 'విమ్స్ ప్రధాన ద్వారాల వద్ద నిఘా కరువు' అనే శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన వార్తకు విమ్స్ అధికారులతోపాటు నగర పోలీసులు స్పందించారు. బుధవారం పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాలతో ఆరిలోవ సీఐ జి.గోవిందరావు విమ్స్‌ను సందర్శించారు. విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబుతో సంప్రదించి ప్రధాన ద్వారాల వద్ద నుంచి ఎక్కడెక్కడ సీసీ కెమెరాలు అవసరమో తెలుసుకున్నారు. ప్రస్తుతం విమ్స్ లోపల ఉన్న సీసీ కెమెరాలతోపాటు సుమారు మరో 100 చోట్ల సీసీ కెమెరాల ఏర్పాటుకు సిద్ధమవుతున్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం

సీతంపేట: బుల్లయ్య కళాశాలలో జీవశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో బుధవారం జాతీయ పోషకాహార వారోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథులు నాగార్జున యూనివర్సిటీ మాజీ వీసీ ఆచార్య వి.బాలమోహన్‌దాస్, కృష్ణా యూనివర్సిటీ మాజీ వీసీ ఆచార్య రామకృష్ణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పోషకాహారం తీసుకోవాలని, జంక్ ఫుడ్ జోలికి పోవద్దని సూచించారు. ఈ సందర్భంగా బీఎంఐ డైట్ ప్లాన్, కల్తీ ఫుడ్, నేచురల్ ప్రిజర్వేటివ్స్, ఈస్ట్ కిణ్వ ప్రక్రియ, మైక్రో గ్రీన్స్, ప్రో బయోటిక్స్, తదితర అంశాలపై విద్యార్థులు ప్రదర్శించిన డెమోలు, చార్టులు ఆకట్టుకున్నాయి.

'ఆస్తి పన్ను తగ్గింపు' అజెండాలో పెట్టండి



మేయర్ హరివెంకటకుమారికి వినతిపత్రం అందజేస్తున్న గంగారావు

దాబాగార్డెన్స్: ఆస్తి పన్ను తగ్గింపు, ఆస్తి విలువ ఆధారిత పన్ను రద్దు, చెత్తపై యూజర్ చార్జీల రద్దు విషయమై జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో అజెండాగా పెట్టాలని జీవీఎంసీ సీపీఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు, సీపీఎం నగర కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్ కోరారు. ఈమేరకు బుధవారం మేయర్ గొలగాని హరివెంకటకుమారికి వారు వినతిపత్రం అందజేశారు.

ఈ నెల 10న నిర్వహించే సమావేశంలో ప్రస్తుత నివాస భవనాల ఆస్తి పన్ను పరిధి 0.13 శాతం నుంచి 0.10 శాతానికి, నివాసేతర భవనాలకు 0.30 శాతం నుంచి 0.20 శాతానికి తగ్గింపుకు తీర్మానం చేయాలని కోరారు. చెత్తపై యూజర్ చార్జీలు పూర్తిగా రద్దు విషయమై కూడా తీర్మానించాలన్నారు. రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆస్తి పన్ను తగ్గిస్తామని, సమీక్షిస్తామని, చెత్తపై యూజర్ చార్జీలు పూర్తిగా రద్దు చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ప్రజలకు వాగ్దానం చేసిందని గుర్తు చేశారు. ఈ ప్రతిపాదనలకు జీవీఎంసీ కౌన్సిల్‌లో ఉన్న టీడీపీ, జనసేన, బీజేపీ కార్పొరేటర్లు మద్దతిస్తారని భావిస్తున్నామని, వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు కూడా సీపీఎం ప్రతిపాదనలు బలపరుస్తారని ఆశిస్తున్నట్టు వినతిపత్రంలో పేర్కొన్నారు.

వరద బాధితులకు 'చారిటీ బాక్స్' సాయం



అక్షయపాత్ర సంస్థ ప్రతినిధికి చెక్కు అందిస్తున్న చారిటీ బాక్స్ సభ్యులు

బీచ్‌రోడ్డు: విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆహారం సరఫరా చేస్తున్న అక్షయపాత్ర ఫౌండేషన్‌కు చారిటీ బాక్స్ స్వచ్ఛంద సంస్థ తమ వంతు సహాయం చేసింది. అక్షయపాత్ర కార్యాలయంలో సంస్థ ప్రతినిధి యదురాజా దాసకు బుధవారం చారిటీ బాక్స్ సభ్యులు రూ.11,116 చెక్కును అందజేశారు.

ఈ సందర్భంగా చారిటీ బాక్స్ కోశాధికారి పొట్నూరు వెంకట శివప్రసాద్ మాట్లాడుతూ వరద బాధితులకు ఆహారం అందించడం తక్షణ కర్తవ్యమన్నారు. ఆహారం పంపిణీలో భాగం కావాలని భావించి తమ సంస్థ తరఫున సాయంగా విరాళం అందజేశామన్నారు. మూడేళ్ల కిందట గోదావరి వరదల సమయంలో కూడా సహాయం చేశామని గుర్తుచేశారు. చారిటీ బాక్స్ ప్రతినిధి వెంకట రమణ మాట్లాడుతూ చేసే సాయం చిన్నదా, పెద్దదా అని ఆలోచించకుండా అది ఎంతవరకు అర్హులకు అందుతున్నదన్నదే ముఖ్యమన్నారు. ఇంతవరకు అలానే సేవా కార్యక్రమాలు చేస్తూ వచ్చామని చెప్పారు. కార్యక్రమంలో చారిటీ బాక్స్ అధ్యక్షుడు లక్కోజు నూకరాజు, సభ్యుడు కొంతం శ్రీకాంత్ పాల్గొన్నారు.

బధిర విద్యార్థుల చేతుల్లో రూపుదిద్దుకున్న మట్టి వినాయకులు



మట్టి వినాయక ప్రతిమలు తయారు చేస్తున్న విద్యార్థులు

ఎంవీపీకాలనీ: పెదవాల్తేరు సన్‌ఫ్లవర్ స్కూల్ మూగ, చెవిటి విద్యార్థులు వినాయకుడి మట్టి ప్రతిమలను తయారు చేశారు. స్కూల్ ఆవరణలో బుధవారం ఈ కార్యక్రమం జరిగింది. పర్యావరణ పరిరక్షణపై స్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు స్కూల్ యాజమాన్యం ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. విద్యార్థులు చురుగ్గా పాల్గొని మట్టి ప్రతిమలను పెద్ద ఎత్తున తయారు చేసి ఆకట్టుకున్నారు. నగర ప్రజలంతా పర్యావరణ హితంగా మట్టి గణపతి ప్రతిమలను వినాయక చవితి వేడుకల్లో వినియోగించాలనే సందేశాన్ని ఇచ్చేందుకు విద్యార్థుల ద్వారా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు స్కూల్ ప్రిన్సిపాల్ కృష్ణవేణి తెలిపారు. పలువురు ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

పనిచేసిన చోటే దొంగతనం

నిందితుడి అరెస్ట్, కోర్టులో హాజరు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాసరావు

ఎంవీపీకాలనీ: పనిచేస్తున్న చోటే దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. ఎంవీపీ పోలీస్ స్టేషన్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ద్వారకా క్రైం సీఐ శ్రీనివాసరావు వివరాలు వెల్లడించారు. పీఎస్ పరిధిలోని ఎంవీపీ కాలనీ ఉషోదయ కూడలి సమీపంలోని టెక్నోసిస్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్‌లో జంధ్యాల హేమచందు అనే వ్యక్తి సేల్స్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. గత నెల 7న ఆఫీసులో ఎవరూ లేని సమయంలో సంస్థ యజమాని బుద్దా అన్నపూర్ణ హ్యాండ్ బ్యాగ్‌లోని బంగారు గాజులు, రూ.1,000 నగదు దొంగిలించాడు. ఈ విషయాన్ని ఈ నెల 2న గుర్తించిన అన్నపూర్ణ గాజులు పోయాయని ఎంవీపీ క్రైం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కొందరిపై ఆమె అనుమానం వ్యక్తం చేయడంతో.. ద్వారకా క్రైం సీఐ శ్రీనివాసరావు, ఎంవీపీ క్రైం ఎస్ఐ ఎస్.రాజు దర్యాప్తు చేసి అదే సంస్థలో పనిచేస్తున్న హేమచందును నిందితుడిగా గుర్తించారు. అతడిని వాసవానిపాలెం సమీపంలో అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేసి, కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు. నిందితుడి నుంచి రెండు బంగారు గాజులను స్వాధీనం చేసుకున్నామన్నారు. సమావేశంలో ఎస్ఐ రాజు తదితరులు పాల్గొన్నారు.

కోల్‌కతా ఘటనపై కొవ్వొత్తుల ప్రదర్శన



కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పిస్తున్న ఆచార్యులు, విద్యార్థులు, పరిశోధకులు

మహారాణిపేట: కోల్‌కతాలో ట్రైనీ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటనకు నిరసనగా బుధవారం ఆంధ్రా యూనివర్సిటీ విద్యా విభాగంలో ఆచార్య టి.షారోన్‌రాజు ఆధ్వర్యంలో ఆచార్యులు, విద్యార్థులు, పరిశోధకులు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా షారోన్‌రాజ్ మాట్లాడుతూ ఇటువంటి అతి హేయమైన, భయానకమైన ఘటనలను ప్రతి ఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చారు. ఈ ఘాతుకానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రకాశ్, డాక్టర్ రాము, డాక్టర్ ప్రణీత్, డాక్టర్ సాల్మన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మించారు.. స్తంభాలు మరిచారు

ఆరిలోవ: బీఆర్‌టీఎస్ రహదారిని ఆనుకొని పెదగదిలి కూడలి నుంచి తోటగరువు వెళ్లే మార్గంలో గెడ్డపై ఇరుకు బ్రిడ్జిని ఇటీవల జీవీఎంసీ విస్తరించింది. ఇక్కడ సుమారు 20 అడుగుల వెడల్పు ఉండే బ్రిడ్జిని పూర్తిగా తొలగించి 80 అడుగులకు విస్తరించి కొత్తగా నిర్మించారు. దానిపై అటు బీఆర్‌టీఎస్ కూడలి వరకు, ఇటు ఎర్నిదుర్గమాంబ ఆలయం వరకు రోడ్డును కూడా 80 అడుగుల వెడల్పు చేశారు. ఇక్కడ పాత రోడ్డు పక్క నుంచి హై ఓల్టేజీ విద్యుత్ లైన్ ఉండేది. ఇప్పుడది విస్తరించిన రోడ్డు మధ్యలో ఉంది. రోడ్డు నిర్మించిన అధికారులు అక్కడ హై ఓల్టేజీతో ఉన్న విద్యుత్ లైన్‌ను పక్కకు జరపడం మరిచిపోయారు. ఆ లైన్‌ను దానికి సంబంధించిన విద్యుత్ స్తంభాలు వరుసగా రోడ్డుపై ఉండటంతో వాహనాల రాకపోకలకు అడ్డంగా నిలిచాయి. వాటి వల్ల రాత్రిళ్లు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహనచోదకులు భావిస్తున్నారు. ఈ విద్యుత్ స్తంభాలను వెంటనే రోడ్డు మధ్య నుంచి పక్కకు తొలగించాలని అధికారులను కోరుతున్నారు.



పెదగదిలి గెడ్డపై నిర్మించిన రోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభాలు

ఏయూ హాస్టళ్లలో ఆకస్మిక తనిఖీలు



విద్యార్థుల హాస్టల్ గదిలో తనిఖీ చేస్తున్న అధికారులు

సీతమ్మధార: ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థుల హాస్టళ్లలో అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేశారు. బుధవారం రాత్రి 9.30 నుంచి సుమారు రెండు గంటల పాటు ఈ ప్రక్రియ కొనసాగింది. ముందుగా ఇంజినీరింగ్ కళాశాల బాలుర వసతి గృహం హాస్టళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. హాస్టళ్లలో విద్యార్థులతోపాటు బయట వ్యక్తులు ఎవరైనా ఉంటున్నారా, విద్యార్థులు ఏ విధంగా ఉంటున్నారు అనే వాటిని ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. అనంతరం ఆర్ట్స్ కళాశాల, సైన్స్ కళాశాల హాస్టళ్లను సైతం తనిఖీ చేశారు. విశ్వవిద్యాలయాల్లో మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలు, గంజాయి వంటి వాటికి స్థానం ఇవ్వరాదని ఏయూ అధికారులు నిర్ణయించారు. ఏయూను ర్యాగింగ్ రహితంగా తీర్చిదిద్దాలని పనిచేస్తున్నారు. దీనికోసం పటిష్ట ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారు. దీనిలో భాగంగా అధికారులు బుధవారం రాత్రి హాస్టళ్లలో తనిఖీలు నిర్వహించారు. ఇకపై తరచూ ఆకస్మికంగా ఇటువంటి తనిఖీలు చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. విద్యార్థుల భద్రత, క్రమశిక్షణకు అత్యధిక ప్రాధాన్యాన్ని అధికారులు ఇస్తున్నారు. ఈ తనిఖీల ప్రక్రియలో రెక్టార్ ఆచార్య ఎన్.కిషోర్ బాబు, హాస్టల్స్ చీఫ్ గార్డెన్స్ హరినాథ్, రమేష్‌బాబు, చిట్టిబాబు, ఏయూ సెక్యూరిటీ విభాగం డీన్ ఆచార్య పి.అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో ప్రీడయాబెటిస్‌కు చెక్

బీచ్‌రోడ్డు: దేశవ్యాప్తంగా ప్రీడయాబెటిస్ కేసులు గణనీయంగా పెరుగుతున్నాయని, దీని నివారణకు పోషకాహారం ఒక్కటే సరైన మార్గమని పోషకాహార నిపుణురాలు డాక్టర్ రోహిణి పాటిల్ తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ది లాన్సెట్ డయాబెటిస్ అండ్ ఎండోక్రినాలజీలో ప్రచురించిన ఒక అధ్యయనం ప్రకారం.. దేశ జనాభాలో 6–15 శాతం మందికి ప్రీడయాబెటిస్ ఉన్నట్లు అంచనా ఉందన్నారు. దీన్ని అధిగమించేందుకు ప్రీడయాబెటిక్ డైట్‌లో బాదం, ఆకుకూరలు, క్లీన్ ప్రోటీన్, తృణధాన్యాలు తప్పకుండా ఉండేలా చూసుకోవాలని సూచించారు.

1.5 కేజీల గంజాయి స్వాధీనం

బీచ్‌రోడ్డు: అక్రమంగా రవాణా చేస్తున్న 1.5 కేజీల గంజాయిని మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా.. రామ్‌నగర్‌లోని ప్రభుత్వ అతిథి గృహం సమీపంలో గంజాయి అక్రమ రవాణా జరుగుతోందని అందిన సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు నిర్వహించగా.. ముగ్గురు వ్యక్తుల వద్ద 1.5 కేజీల గంజాయిని గుర్తించారు. దానిని స్వాధీనం చేసుకుని, ముగ్గురిని అదుపులోకి తీసుకొని త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నారు.

రైల్వే స్టేషన్‌లో 13.7 కిలోలు

తాటిచెట్లపాలెం: అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో రైల్వే పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకుని, 13.7 కేజీల సరకును స్వాధీనం చేసుకున్నారు. రైల్వే స్టేషన్‌లో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది బుధవారం తనిఖీలు నిర్వహించారు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఆర్పీఎఫ్ ఎస్ఐ జూలి కర్మాకర్ తనిఖీల్లో కేరళకు చెందిన వివేక్ వద్ద గంజాయిని గుర్తించారు. అతను 13.7 కిలోల గంజాయిని విశాఖ రైల్వేస్టేషన్ మీదుగా చెన్నైకు తరలిస్తున్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం జీఆర్పీ ఎస్ఐ వి.రవివర్మకు అప్పగించారు. అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచారు.

నేత్రదానంపై అపోహలు వద్దు

సీతంపేట: నల్ల గుడ్డు అంధత్వం బారినపడి అనేక మంది చూపు కోల్పోతున్నారని, ప్రతి ఒక్కరూ నేత్రదానం చేసేందుకు ముందుకు రావాలని ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల ఆఫ్తాల్మజీ హెడ్ డాక్టర్ ప్రభాకర శాస్త్రి పిలుపునిచ్చారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా బుధవారం ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వి.మీనాక్షి ఆధ్వర్యంలో ఆస్పత్రిలో రోగులకు, వారి బంధువులకు నేత్రదానం ఆవశ్యకతపై అవగాహన కల్పించారు.